సాక్షి
శ్రీకాకుళం
బుధవారం : 18 : జూన్ : 2025



మట్టి పరీక్ష.. నేలకు రక్ష

మట్టి పరీక్షలు రైతుకు మేలు చేస్తాయి. నేలకూ రక్షణ కల్పిస్తాయి.

- 8లో



మస్తర్లలో మాయాజాలం

దండుగోపాలపురంలో మస్తర్ల మాయాజాలం జరుగుతోంది. అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి.

- 8లో

ఈ నీరే తాగాలి..!



నర్సిపురంలో మంచినీటి కుళాయి ఉన్న ప్రాంతమిది. అందరికీ తాగునీరు అందించే ఈ ప్రాంతం ఇంత అధ్వానంగా ఉన్నా.. అధికారులు కిమ్మనడం లేదు. ఈ మురుగు దారి గుండా వెళ్లి నీరు తెచ్చుకోవడానికి మహిళలు నానా పాట్లు పడుతున్నారు. - నందిగాం

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌లో అసిస్టెంట్ కెమిస్ట్ పోస్టుల ఉద్యోగాలకు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 2020 నుంచి 2025 మధ్యలో డిగ్రీ ఉత్తీర్ణులైన ప్రతి ఒక్కరూ అర్హులేనని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు, రెండు పాస్ ఫొటోలతో హాజరై జేకేసీ కోఆర్డినేటర్ వై.మణికుమార్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు సూచించారు.

అగ్ని ప్రమాదం దురదృష్టకరం



కాలిపోయిన పర్ణశాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: ఆధ్యాత్మిక కూర్మ గ్రామంలో అగ్ని ప్రమాద సంఘటన దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి అన్నారు. మంగళవారం కూర్మ గ్రామాన్ని సందర్శించి హరేకృష్ణ ప్రార్థన పర్ణశాలను పరిశీలించారు. కృష్ణ భక్తులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఎన్‌పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు లుకలాపు ప్రసాద్, శ్రీనివాసరావు, నక్క ఆనందరావు, గోర్ల నాగేశ్వరరావు, చింతాడ సూర్యనారాయణ, ఈగల చిన్నారావు, బి.గోవిందరావు పాల్గొన్నారు.

'జీడి పరిశ్రమలు వెంటనే తెరిపించాలి'



మాట్లాడుతున్న తేజేశ్వరరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అక్రమంగా బంద్ చేసిన జీడి పరిశ్రమల్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని లేకుంటే జూన్ 21న పలాసలో కార్మికులతో మహాధర్నా చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాస పారిశ్రామిక ప్రాంతంలో జీడి పరిశ్రమల యాజమాన్యాలన్నీ పరిశ్రమల బంద్ ప్రకటించడం చట్టవ్యతిరేకమైన చర్య అని అన్నారు. పరిశ్రమలు బంద్ చేసి రెండు వారాలు పూర్తయినా నేటికీ తెరవకపోవడంతో సుమారు 20వేల మంది కార్మికులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మూసివేసిన పరిశ్రమలు వెంటనే తెరిపించాలని, బంద్ కాలానికి కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ కట్టాలని వారు యాజమాన్యాలను డిమాండ్ చేశారు.



● శ్రామికాసనం

కొత్తారిలో శ్రామిక మహిళలు ఆసనాలు వేశారు. యోగాంధ్రలో భాగంగా ఏపీఓ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేతనదారుల చేత యోగా చేయించారు. యోగాతో మానసిక ప్రశాంతత దొరుకుతుందని ఆయన వివరించారు.

– ఇచ్ఛాపురం రూరల్



జీడిపప్పు పరిశ్రమ యజమానులకు వ్యాపారమే కావచ్చు.. కానీ కూలీలకు అదే బతుకు. రోజు కూలి చేతిలో పడితేనే ఇంటి బండి నడుస్తుంది. పప్పు బడ్డీ తెరిస్తేనే వంటింటికి సరుకు అందుతుంది. అలాంటిది 16 రోజులుగా దాదాపు 250 పరిశ్రమలు మూత పడి ఉన్నాయి. ఇన్ని రోజులుగా కార్మికులకు సంపాదన లేదు. పరిశ్రమ యజమానులతో పాటు పాలకులు, అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో జీడి కార్మికులు ఆర్తనాదాలు చేస్తున్నారు.

కార్మిక లోకం..
ఆకలి నినాదం



16 రోజులుగా మూతపడిన 250 జీడి పరిశ్రమలు



కాశీబుగ్గ : బంద్ కారణంగా బోసి పోయిన ఓ జీడి పరిశ్రమలో కటింగ్ విభాగం

- ఉపాధి లేక 15 వేల మంది కార్మికులు ఆర్తనాదాలు
- పట్టించుకోని పాలకులు, జీడి పరిశ్రమల యజమానులు
- పీసీఎంఏ కార్యాలయం ముందు కార్మికుల నిరసన



జీడి పరిశ్రమల సంఘ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తున్న కార్మికులు

కాశీబుగ్గ:

పలాస–కాశీబుగ్గ పరిధిలో జీడి కార్మికుల ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. జీడిపప్పులు అధిక నిల్వలు ఉన్నాయని, ధరలు తగ్గాయని అంటూ అనేక కారణాలు చూపుతూ గత పదహారు రోజులుగా జీడి పరిశ్రమల యజమానులు మూకుమ్మడిగా పరిశ్రమలను మూసి వేశారు. రెండు వారాలు గడిచి మూడో వారం నడుస్తున్నా తెరవకపోవడంతో కార్మిక లోకం ఆర్తనాదాలు చేస్తోంది. జీడి పరిశ్రమలు తెరవాలని పేద, నిరుపేద కార్మికులు పొట్టకొట్టొద్దని గొంతు విప్పుతూ కార్మికులు రోడ్డెక్కారు.

మూతబడిన జీడి పరిశ్రమలు..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధితో పాటు మందస, వజ్రపుకొత్తూరు, పలాస రూరల్, ఆంధ్రా–ఒడిశా సరిహద్దుల్లో 400లకుపైగా జీడి పరిశ్రమలు ఉన్నాయి. అందులో జంట పట్టణాలకు చెందిన పలాస, కాశీబుగ్గ, మొగిలిపాడు, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న 250పరిశ్రమలు మూసి వేశారు. పదిహేనువేలకుపైగా సభ్యత్వాలు కలిగిన కార్మికులు, ఇతర ఐదు వేల మంది (సభ్యత్వ రుసుము చెల్లించలేని)కార్మికులతో కలుపుకుని పదిహేనువేలకుపైగా కార్మికులు ఉన్న కాష్యూ లేబర్, అండ్ రైస్ మిల్లర్స్ లేబరు యూనియన్‌కు పలాస కాష్యూ మేన్యుఫాక్చర్ అసోసియేషన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ వారు ఈ మేరకు లేఖ రాశారు. అధిక మొత్తంలో పరిశ్రమల్లో జీడి ఉత్పత్తులు పేరుకుపోయాయని, అంతే కాకుండా జీడి ధరలు సైతం తగ్గిపోయాయని, అందుకే అమ్మకాలు లేవని, అవి అమ్ముడు పోయేంతవరకు జీడి పరిశ్రమలు తెరవబోమని రెండు పర్యాయాలు లేఖలు రాశారు. ఆ లేఖలకు కార్మిక సంఘం స్పందించి పరిశ్రమలు తక్షణమే తెరవాలని కోరాయి. కానీ అవేమీ పట్టించుకోకుండా పరిశ్రమల మూత మూడో వారానికి చేరడంతో ఒక్కసారిగా కార్మికులు ఆక్రోశానికి గురై రోడ్డెక్కారు. జీడి పరిశ్రమలకు లాభాలు వస్తే తమకేమైనా ఇస్తారా అంటూ నినాదాలు చేస్తూ పీసీఎంఏ కార్యాలయం ఎదురుగా నిరసనకు దిగారు. ఇప్పటికైనా తెరవకపోతే కార్మికుల ఉద్యమం ఉద్ధృతం చేస్తామని తెలిపారు.

95శాతం మంది మహిళలే..

జీడి పరిశ్రమలో ఫీలింగ్, కటింగ్, బాయిలింగ్, జీడి పప్పు సైజులు వేరు చేసేవారు, రిక్షా కార్మికులు, ట్రాన్స్‌పోర్టు విభాగం, ప్యాకింగ్, అమ్మకం, ఎగుమతులు, ఎంఎస్‌టీలు, సెక్యూరిటీ, గుమస్తాలు, బ్రోకర్లు, మధ్యవర్తులు ఇలా ప్రత్యక్షంగా పదిహేనువేల మంది కార్మికులు పరోక్షంగా మరో ఐదు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కార్మికులలో తొంభైఐదు శాతం మహిళలే. పరిశ్రమలు తెరవకపోవడంతో రూ.500 నుంచి రూ.700 వరకు రోజు కూలి చేసుకునే జీడి కార్మికులు తీవ్రమైన ఆకలి కేకలతో ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే తెరవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

"జూన్‌లో ఇలా చేయడం భావ్యమా..



జీడి పరిశ్రమల్లో అనేక మంది మహిళలు పనిచేస్తున్నారు. వారి పిల్లలను కళాశాలలకు, పాఠశాలలకు చేర్పించే సమయంలో జీడి పరిశ్రమలు మూతవేయడం తీవ్రమైన సమస్య. పదహారు రోజులుగా పనిచేసి ఉండి ఉంటే రూ.11 వేలకు పైగా డబ్బులు వచ్చేవి. ఎవరి వద్దా చేయి చాచకుండా ఖర్చులు దాటిపోయేవి. కానీ ఇప్పుడు పరిస్థితి అలా లేదు.

– రాపాక అప్పలమ్మ, జీడి కార్మికురాలు, పలాస

"డ్వాక్రా కట్టలేకపోతున్నాము..



పలాస జీడి పరిశ్రమలో పనిచేస్తున్న మహిళలంతా కుటుంబ అవసరాలకు డ్వాక్రా రుణాలు వాడుతున్నారు. పరిశ్రమలు తెరవకపోవడంతో రుణాలు చెల్లించలేకపోతున్నాం. కుటుంబాలు ఆకలితో ఉండిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇళ్లు అద్దెకు తీసుకుని జీడి పరిశ్రమలలో పనిచేస్తున్న వారున్నారు. తక్షణమే కార్మికుల సమస్యలను గుర్తించి ప్రభుత్వం ముందుకు వచ్చి చర్యలు చేపట్టాలి. తక్షణమే పరిశ్రమలు తెరుచుకునేలా చూడాలి.

– పైల నారాయణమ్మ, జీడి కార్మికురాలు, పురుషోత్తపురం

"చిన్నచూపు చూస్తున్నారు..



జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను జీడి పరిశ్రమల యజమానులు చిన్నచూపు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు, సబ్సిడీలు, రుణాలు, ప్రోత్సాహకాలతో పరిశ్రమలు పెట్టుకుని నడుపుతున్నారనే విషయం మరిచిపోయి ప్రవర్తిస్తున్నారు. ఓ పది మంది పరిశ్రమల యజమానులు మాత్రమే చక్రం తిప్పుతున్నారు. వారి మాటే చెల్లాలనే ధోరణిలో ఉన్నారు. కార్మికుల ఏమైపోయినా వారికి అవసరం లేదు. – కోనారి రాము, కోశాధికారి, కాష్యూ లేబరు యూనియన్, పలాస

జిల్లాలో మొత్తం జీడి పరిశ్రమలు	మూత బడినవి	మొత్తం కార్మికులు	మొత్తం కార్మికుల్లో మహిళా కార్మికుల శాతం
400	250	20,000	95%

దారి కాసి..
కత్తితో పొడిచి..

- మామను హతమార్చిన అల్లుడు
- నడి రోడ్డుపై కత్తితో దాడి
- కుటుంబ తగాదాలే హత్యకు కారణం



గంగయ్య మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న కుటుంబ సభ్యులు



జీవన్ రెడ్డి



గంగయ్య (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: పిల్లనిచ్చిన మామను అల్లుడు అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేశాడు. ఇచ్ఛాపురం మండలం మండపల్లిలో జరిగిన ఈ ఘటన సంచలనం రేకెత్తించింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం మండపల్లి గ్రామానికి చెందిన పాతిర్ల జీవన్‌రెడ్డి (దశరథ రెడ్డి)అదే గ్రామానికి చెందిన బర్రి గంగయ్య(58) మొదటి కుమార్తె డిల్లమ్మ ను తొమ్మిదేళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. డిల్లమ్మ రెండో కాన్పు కోసం రెండేళ్ల కిందట పుట్టింటికి వచ్చింది. అత్తింటి వారు వేధిస్తున్నారని అప్పటి నుంచి మెట్టినింటికి వెళ్లలేదు. దీంతో భర్త జీవన్ రెడ్డి తరచూ అత్తమామలు, భార్యతో గొడవలు పడుతుండేవాడు.

తన కుమార్తె పెళ్లికి కట్నంగా ఇచ్చిన ద్విచక్ర వాహనాన్ని మామ గంగయ్య ఇటీవల తన ఇంటికి తీసుకువచ్చేశాడు. ఈ విషయమై మంగళవారం ఉదయం మరోమారు గొడవ పడ్డారు. మామ గంగయ్య పెద్ద మనుషుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లేందుకు తన సైకిల్‌పై వెళ్తుండగా, మండపల్లి గ్రామ సచివాలయం ఎదురుగా కాపు కాసిన అల్లుడు జీవన్‌రెడ్డి మరోమారు మామ తో గొడవపడి కత్తితో బలంగా పొట్టపై భాగంలో పొడవడంతో గంగయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే హుటాహుటిన వాహనంలో ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గం మధ్యలో గంగయ్య మృతి చెందాడు. అల్లుడు జీవన్‌రెడ్డి అక్కడి నుంచి పరారైపోయాడు. మృతుడికి భార్య జానకమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు జగదీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

■ కుళాయి నీటిలో వానపాములు

తాగునీటిని సరఫరా చేసే కుళాయిల ద్వారా వానపాములు వస్తుండడంతో టెక్కలి మండలం రావివలస గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురుగులు, వానపాములు, జలగలు పడుతుండటంపై భయపడుతున్నారు. కొద్ది నెలలుగా వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేయకపోవడం వల్లనే ఇలా జరుగుతోందని తెలిపారు. – టెక్కలి రూరల్



కుళాయి నీటిలో కనిపిస్తున్న పురుగులు

యోగాంధ్రకు ముమ్మర సన్నాహాలు



మాట్లాడుతున్న మంత్రులు. చిత్రంలో కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే యోగాంధ్ర–2025 కార్యక్రమం రాష్ట్రానికి గొప్ప గౌరవమని, ఎలాంటి లోపం లేకుండా దీన్ని విజయవంతం చేయాలని, ప్రతి శాఖ సమన్వయంతో, సమగ్ర పర్యవేక్షణతో ముందుకు సాగాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస రావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, యోగాంధ్ర ఇన్‌చార్జిలు సమావేశంలో పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు లక్ష్యం...

గిన్నిస్ బుక్‌లో స్థానం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని మంత్రులు తెలిపారు. జిల్లా నుంచి విశాఖకు వెళ్లే ప్రణాళికలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా నుంచే 20 వేల మంది విశాఖ కార్యక్రమానికి వెళతారని కలెక్టర్ తెలిపారు. 150 ఆర్టీసీ, 400 ప్రైవేట్ బస్సులు ఇందుకోసం ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 15 వేల మంది సామాన్య ప్రజలు కాగా, మిగతా 5 వేల మంది ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులు ఉంటారన్నారు. భీమిలి స్పాట్ జిల్లాకు కేటాయించగా, అక్కడే వేదిక వద్ద అల్పాహారం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో ప్యాకేజ్డ్ భోజనం అందజేయాలని మంత్రులు ఈ సందర్భంగా సూచించారు.

మరుగు

దొడ్లు–ట్రాఫిక్ కీలకం

ట్రాఫిక్ నియంత్రణ, మరుగుదొడ్ల ఏర్పాటు విషయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. 9 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశామని, పైడిభీమవరం దాటి జిల్లాలోని ప్రజలకు దాబాలు, పెట్రోల్ బంకులు, నేషనల్ హైవే టాయిలెట్ల వద్ద శుభ్రమైన వసతులు కల్పించనున్నట్టు వివరించారు. యోగాంధ్ర 2025 కోసం జిల్లాలో 6,500 వేదికలు గుర్తించగా, అందులో 3,500 పాఠశాలలు ఉన్నాయన్నారు. జిల్లాలో కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే 9.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ పూర్తయ్యిందని, రెండు లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ నెల 21న కార్యక్రమంలో పాల్గొంటారని, మొత్తం 10 లక్షల మందిని కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నదే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, ఎరగ్రొండపాలెం ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, పలు శాఖలు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

- 15వ ఆర్థిక సంఘ నిధులు జమ చేయని ప్రభుత్వం
- జిల్లాకు రెండో విడతగా రూ.39 కోట్లు కేటాయించిన కేంద్రం
- పంచాయతీలకు డబ్బులు చేరని వైనం
- నిధుల కోసం ఎదురుచూస్తున్న పంచాయతీలు

మాటల్లో డాబు..
పైకమేదీ బాబూ!



అరసవల్లి: పంచాయతీలు నిధుల కోసం ఎదురు చూస్తున్నాయి. రాష్ట్రం ఊరికి డబ్బులివ్వడం లేదు సరి కదా..కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘ నిధులు సైతం పంచాయతీలకు చేరకుండా 'మళ్లింపు' మంత్రం పఠిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీల దశ దిశ మార్చేస్తామని ఓ పక్క చంద్రబాబు, మరో పక్క పవన్ కల్యాణ్ గుప్పించిన ప్రకటనలన్నీ గాలి మూటలేనని తేలిపోయింది. పల్లె ఖజానాకు నిధులు చేరకపోవడంతో ఊళ్లలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది.

కూటమి నేతలు కుట్ర రాజకీయం

జిల్లాలో ప్రస్తుతం సర్పంచ్‌ల బాధ వర్ణనాతీతంగా మారింది. అత్యధికంగా వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చిన సర్పంచ్‌లు జిల్లాలో ఉండడంతో.. ఆయా పంచాయతీల్లో అభివృద్ధికి ఏమాత్రం ఆస్కారమివ్వకుండా కూటమి నేతలు కుట్ర రాజకీయాలకు దిగుతున్నారు. ఈ క్రమంలో కేంద్రమిచ్చి, నేరుగా జమ కావాల్సిన నిధులను కూడా దారి మళ్లించేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా 'తల్లికి వందనం' పేరిట అమలు చేసిన పథకానికి ఇవే నిధులు మళ్లించి జనాలకు అందజేశారనే ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. 'తల్లికి వందనం' పథకానికి రాష్ట్రంలో గ్రామ సర్పంచ్‌ల పిల్లలు అనర్హులని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని అమలు చేయడం మరింత దురదృష్టకరమనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాకు అందని రూ.39 కోట్లు నిధులు

జిల్లాలో మొత్తం 30 మండలాల్లో 912 గ్రామ పంచాయతీలుంటే..ఇందులో ఎన్నికలు నిర్వహించని 16 పంచాయతీలు మినహా మిగిలిన 896 పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘ నిధుల కేటాయింపులు జరగాల్సి ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘ నిధులు తొలివిడతగా రూ.38,66,19,415 వరకు జమ చేశారు. రెండో విడతగా గత రెండు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.39.16 కోట్ల నిధులు జిల్లాకు కేటాయింపు చేశారు. అయితే జిల్లాలో 896 పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. దీనిపై గ్రామ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధుల మళ్లింపుతో పల్లెలు అవస్థలు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంపద సృష్టిస్తా అంటే.. ఇలా కేంద్ర నిధులను మళ్లింపు చేసి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు వర్తింపజేయడమా అని ప్రశ్నిస్తున్నారు.

పల్లెకు సుస్తీ..

జిల్లాలో దాదాపుగా ఉన్న మేజర్ గ్రామ పంచాయతీలతో పాటు సాధారణ పంచాయతీల్లోనూ అపరిశుభ్ర వాతావరణమే కనిపిస్తోంది. పల్లెల్లో ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలతో ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వలుండిపోయాయి. కాలువల్లో పూడిక తీత పనులు పెద్దగా జరగకపోవడంతో చెత్త చెదారాలతో పల్లె రహదారులు నిండిపోయాయి. టెక్కలి డివిజన్‌లో పంచాయతీల పరిస్థితి చాలా అధ్వానంగా ఉన్నాయి. ఇక జిల్లా కేంద్రానికి సమీపంలోని శ్రీకాకుళం రూరల్, గార, ఎచ్చెర్ల, లావేరు తదితర మండలాల్లోని పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో అంటు వ్యాధులు ప్రబలడంతో పాటు స్థానికులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. నిధుల లేమితో పంచాయతీల్లో రోజూ జరగాల్సిన పరిశుభ్రత పనులు కూడా జరగడం లేదు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు.

ఎక్కడా నిధుల లేమి ప్రస్తావన రాకుండా చూడాలని కూటమి పాలకులు హెచ్చరికలు జారీ చేస్తున్న క్రమంలో అధికారులు నోరు మెదపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

"నిధులు దారి మళ్లించారు



రాష్ట్రంలో కూటమి పాలనలో ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. గ్రామ పంచాయతీలకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘ రెండో విడత నిధులను కూడా దారి మళ్లించేసి తల్లికి వందనం పథకానికి వాడేశారు. గ్రామ పంచాయతీలకు నిధులివ్వకపోవడంతో పల్లెల్లో నిత్యం పారిశుద్ధ్య పనులను కూడా చేయలేకపోతున్నాం. కేంద్రం ఇస్తున్న నిధులను కూడా పంచాయతీలకు రాకుండా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుండడం దారుణం.

– మార్పు పృథ్వీరాజ్, సర్పంచ్, గార

క్లుప్తంగా

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని తెలగవీధిలో గొరిజల్లి శేఖర్ ఇంట్లో ఇటీవల జరిగిన చోరీ కేసుకు సంబంధించి సుందరాపురం గ్రామానికి చెందిన ఎం.వెంకటరమణను అరెస్టు చేశామని ఎస్‌ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. నిందితుడు బాలసీమ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. చోరీ సొత్తు తులం చైన్, చెవి దుద్దులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తేనే సత్ఫలితాలు



ఉపాధ్యాయుడు రామారావుతో డీఈఓ తిరుమల చైతన్య తదితరులు

జలుమూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో బోధన చేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని డీఈఓ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మంగళవారం చల్లవానిపేట ఉన్నత, జలుమూరు ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం తొమ్మిది మందికే పరిమితమైన విద్యార్థుల సంఖ్య నేడు 86 మందికి చేరుకోవడంలో విశేష కృషి చేశారని జలుమూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మెండ రామారావును ప్రత్యేకంగా అభినందించారు. రామారావు మాస్టారు ఓ క్రియేటర్ అని కితాబునిచ్చారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కలెక్టర్‌కు నివేదించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కొర్లాంలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

గార : కొర్లాం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కొర్లాపు అప్పన్నకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి కారణం తెలియడం లేదు. ఇటీవలే మేకలు అమ్మగా వచ్చిన సుమారు రూ.లక్ష నగదు కాలి బూడిదయ్యాయి. ఆధార్, రేషన్‌కార్డు, దుస్తులు, తిండిగింజలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వీఆర్వో సన్యాసిరావు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయగా, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీపీడీసీఏ అధ్యక్షుడు జయరాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: కళాశాల విద్యార్థులకు సంబంధించి 2024–2025 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ, ఇతర కోర్సుల పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, విద్యా దీవెన, వసతి దీవెన నిధులు కళాశాలలకు విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంటు అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నాన జయరాం కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. స్కాలర్‌షిప్ నిధులలో 25 నుంచి 30 శాతం మాత్రమే ప్రిన్సిపాల్ ఖాతాలకు జమయ్యాయని తెలిపారు. నిధులు విడుదల కాక సిబ్బంది జీతాలు, అద్దె, విద్యుత్ బిల్లులు వంటి ప్రాథమిక ఆర్థిక బాధ్యతలను తీర్చలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడి మృతి



కొర్లాపు శంకరరావు మృతదేహం

నందిగాం: దేవళభద్ర పంచాయతీ జల్లపల్లిలో విద్యుత్ షాక్‌కు గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన నందిగాంకు చెందిన కొర్లాపు శంకరరావు(42) మంగళవారం తోటి భవన నిర్మాణ కార్మికుడు అగురు బాలకృష్ణ, దేవళభద్రకు చెందిన మేస్త్రీ ప్రసాద్ కలిసి జల్లపల్లిలో గొనప కారయ్య ఇంటి సెంటరింగ్ పనికి వెళ్లాడు. ఇనుప గజాలను తీస్తుండగా ఇంటికి ముందు ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైరు తగలడంతో షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి కార్మికులు సపర్యలు చేసినా ఫలితం లేకపోయింది. శంకరరావుకు భార్య గౌరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ జి.వి.రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి పరీక్ష.. నేలకు రక్ష

- భూసార పరీక్షలతో బహుళ ప్రయోజనాలు
- ఫలితాల ఆధారంగా సాగు చేస్తే అధిక దిగుబడులు



కమలాయిపుట్టుగలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయ సహాయకులు, రైతులు



కొజ్జీరియాలో సాగుచేస్తున్న జీలుగ రకంపచ్చిరొట్ట పైరు

కవిటి: అధిక దిగుబడులు సాధించాలనే క్రమంలో కొందరు రైతులు పరిమితికి మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా పంటకు అవసరం లేకపోయినా ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో దిగుబడులు రాకపోగా.. భూమి సారవంతం కోల్పోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే భూసార పరీక్షలు ఒక్కటే మార్గమని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన పంటలు పండాలంటే నేలలో ఖనిజ లవణాలు, పోషకాలు సమృద్ధిగా ఉండాలి. దీనిపై దృష్టి పెట్టకుండా అధిక దిగుబడులు సాధించాలనే ఆశతో కొందరు రైతన్నలు రసాయనిక ఎరువులు భారీగా వినియోగిస్తున్నారు. దీంతో భూమి సమతుల్యత కోల్పోతోంది. మొక్కకు సరైన పోషకాలు అందక పంట దిగుబడులపై పెను ప్రభావం పడుతోంది. మట్టి నమూనా పరీక్షలు చేయించి ,ఆ ఫలితాలకు అనుగుణంగా పంట సాగు చేస్తే మేలైన దిగుబడులతో సాగుఖర్చులు తగ్గే అవకాశముంటుంది.

భూసార పరీక్షలు కీలకం..

భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మ పోషకాల లోపాలను తెలుసుకోవడమే కాకుండా భూమిలో ఏ పోషకాలు తగ్గాయి అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సేంద్రియ కర్బనం తగ్గితే పచ్చిరొట్ట పంటలను సాగు చేసి నష్టాలను నివారించవచ్చు. నేల పోషణ సామర్థ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఏ పంట వేస్తే మంచి దిగుబడి వస్తుందో రైతులు గ్రహించే అవకాశం ఉంటుంది.

మోతాదు మించితే..

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలని తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయనిక ఎరువుల వల్ల భూమిలో పోషకాలు నశించిపోతున్నాయి. పొటాషియం ఎక్కువగా వాడటం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలకు అందకుండాపోతున్నాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. దీంతో ఆ భూమిలో ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమవుతుంది.

ప్రయోగశాలలో..

భూమిలో సేంద్రియ కర్బనం 0.5 నుంచి 0.7 శాతం వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. మట్టిని ప్రయోగశాలలో విశ్లేషించి ఆ నేల స్వభావం లక్షణాలు పోషక విలువలు స్థాయిలను గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ప్రోత్సహిస్తున్నాం



కవిటి మండలంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 745 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా చేశాం. ఇప్పటి వరకు 1237 మంది రైతుల నుంచి భూసార పరీక్షలకు కోసం శాంపిల్స్ తీసుకున్నాం. ఫలితాలు త్వరలో రానున్నాయి. సేంద్రియ కర్బనం, సూక్ష్మ పోషకాల పెంపుదలే లక్ష్యంగా పచ్చిరొట్ట వాడకంపై విస్తృత ప్రచారం కల్పించి జీలుగ ఎరువు వాడకం పెంచాం. రసాయనిక ఎరువుల వాడకంపై రైతులకు ఎప్పటికప్పుడు మా సాంకేతిక సలహాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– పి.శ్రీదేవి, మండల వ్యవసాయాధికారి, కవిటి

మూడేళ్లకోసారి పరీక్ష



వ్యవసాయశాఖ అధికారుల తోడ్పాటుతో ఏటా ఆధునిక వ్యవసాయ విధానాలపై దృష్టిసారించా. కొత్తరకం వరి వంగడాలు సాగుకు ఆసక్తి చూపుతున్నాను. ప్రధానంగా పశువుల గెత్తం వేయడం, పచ్చిరొట్ట పైర్ల సాగు, జింక్ తదితర సూక్ష్మపోషకాల సాగు అన్నిటినీ భూసారపరీక్ష ఫలితాలకు లోబడే వినియోగిస్తున్నాను.

– ఉప్పాడ వాసుదేవరెడ్డి, రైతు, పాతకొజ్జీరియా, కవిటి మండలం

ప్రయోజనాలివే..

- మట్టి పరీక్షల్లో ఆమ్ల క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకోవచ్చు.
- పంట వయసు కాలాన్ని అనుసరించి ఎరువులను సమపాళ్లలో అందించవచ్చు.
- ఆమ్లగుణం ఉన్న నేలల్లో సున్నం, క్షార గుణం ఉన్న నేలల్లో జిప్సంతో నేలను బాగు చేసుకోవచ్చు.
- నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకొని సాగు చేసే పంటలకు ఎరువుల మోతాదు నిర్ణయించవచ్చు.
- నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకొని దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంది.

అమ్మవార్లకు చల్లదనం



నందిగాంలోని ఉమా అగస్త్యేశ్వర పొందర కుల సంఘం ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం గ్రామ దేవతలకు చల్లదనం చేశారు. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ముగ్గురాటలతో వెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ నలుదిక్కుల్లో ఉన్న అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. – నందిగాం

అక్రమాలకు 'అడ్డు' లేకుండా!



గత నెల 26న రోడ్డుకు అడ్డంగా వేసిన బారికేడ్లు (ఫైల్)



ప్రస్తుతం బారికేడ్లు లేకుండా ఉన్న రోడ్డు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి చెందిన వాడాడ కూడలి వద్ద ఉన్న భూముల్లో అక్రమంగా నిర్మించిన రహదారిపై 'సాక్షి' పలుమార్లు ప్రచురించిన కథనాలకు దేవదాయ శాఖాధికారులు స్పందించి గత నెల 26న ఐరన్ మెస్ బారికేడ్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికిందని అంతా భావించారు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదు గానీ మంగళవారం ఉదయానికి బారికేడ్లు మాయమయ్యాయి. పక్కనున్న పొలాల్లో మెస్‌లను తోసేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి అడ్డంగా కట్టుదిట్టంగా బారికేడ్లు వేయడం గానీ, ఏకంగా అక్రమ రహదారిని జేసీబీతో తొలగించడం గానీ చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

మస్తర్లలో మాయాజాలం!

- పనికి రాకుండానే హాజరు నమోదు
- భార్యాభర్తలకు వేర్వేరు జాబ్‌కార్డులు
- దండుగోపాలపురం ఉపాధి పనుల్లో అక్రమాలు జరిగాయంటున్న వేతనదారులు



ఉపాధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురంలో పలు అవకతవకలు జరిగినట్లు వేతనదారులు చెబుతున్నారు. మస్తర్లలో మాయాజాలం నడిపించి పనికిరాకపోయిన వారికి సైతం హాజరు నమోదు చేసి వేల రూపాయలు కాజేశారని ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దండుగోపాలపురంలో 15 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన వరదరాజులను రాజకీయ కక్షతో తొలగించి అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వడ్డితాండ్ర నారాయణ అనే వ్యక్తితో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి పనులను చేయించారు. పనికి రాకపోయినప్పటికీ సుమారు 30 మంది పేర్లను మస్తర్లలో నమోదు చేసి ఒక్కొక్కరి అకౌంట్లో వేల రూపాయలను జమ చేయించి దోచుకున్నారు. బెండి సూర్యనారాయణ (జాబ్ కార్డు నెంబర్ 10446) ఒక్క రోజు కూడా ఉపాధి పని చేయకుండా తొమ్మిది వారాలు ఉపాధి పని చేసినట్లు మస్తర్లలో నమోదు చేశారు. అతని అకౌంట్లో రూ.13వేలు జమ అయ్యాయి. ఇదే తరహాలో బెండి విష్ణుమూర్తి, బాలక కృష్ణారావు, బాలక చంద్రశేఖరరావు, ఆరంగి జగన్నాథరావు, పొందర ప్రసాదరావు, పొందర మధు, కుమ్మరి రామారావు తదితర అకౌంట్లలో నిధులు జమయ్యాయి. ఉపాధి పని చేయిస్తున్న వడ్డితాండ్ర నారాయణ, అతని భార్య హేమలతకు నిబంధనలకు విరుద్ధంగా వేరువేరు జాబ్ కార్డులు ఉన్నాయి. నారాయణ(జాబ్‌కార్డు–10415)కు రూ.15.900, అతని భార్య హేమలత(జాబ్‌కార్డు–10686) ఉపాధి పనికి వెళ్లకపోయినా రూ.6.349 అకౌంట్లో నమోదయ్యాయి. ఇలా 30 మంది వరకు ఉపాధి పనికి వెళ్లకుండా మస్తర్లలో నమోదు చేశారని, దీనిపై దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని వేతనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధి ఏపీవో నరసింహమూర్తి వద్ద ప్రస్తావించగా.. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అక్కడ ఎవరినీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించలేదని తెలిపారు.

నిచ్చెన వేసి..చోరీ చేసి!



కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ లోవరాజు



దొంగతనానికి వినియోగించిన నిచ్చెన

సోంపేట: పలాసపురంలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. సోంపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాసపురం గ్రామానికి చెందిన బెండాళం అశోక్ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. రెండున్నర తులాల బంగారం, ఎల్ఐసీ కలెక్షన్ నగదు లక్ష రూపాయలు బీరువాలో ఉంచారు. సోమవారం రాత్రి ఎప్పట్లాగే కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో నిద్రపోయారు. మంగళవారం ఉదయం లేచి చూసేసరికి వేరే గదిలో ఉన్న బీరువా పగలగొట్టి ఉండటం గమనించారు. అందులో బంగారం, నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి సోంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి బయట నిచ్చెన ఉండటంతో దాని ద్వారా దొంగలు లోపలికి ప్రవేశించి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సోంపేట ఎస్‌ఐ లోవరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

వైద్యులకు బదిలీలు

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్త్రీ వైద్య నిపుణులు జయశ్రీకి పార్వతీపురం బదిలీ అయింది. ఈమె స్థానంలో అగనంపూడి నుంచి స్త్రీ వైద్య నిపుణులు ఉష బదిలీపై వస్తున్నారు. రాజాం ఆసుపత్రి నుంచి జనరల్ మెడిషన్ విభాగంలో కళ్యాణ్ బాబు నరసన్నపేటకు బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం ఈయన జిల్లా ఆసుపత్రుల ఇన్‌చార్జి సమన్వయ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉర్లాం పీహెచ్‌సీలో వైద్యురాలిగా పనిచేస్తున్న గొలివి సుజాత జలుమూరు పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. అలాగే జలుమూరు పీహెచ్‌సీ నుంచి తాడేల శ్రీకాంత్ ఉర్లాం పీహెచ్‌సీకి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం శ్రీకాంత్ అదనపు డీఎంహెచ్‌ఓగా (ఇన్‌చార్జి) బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎస్టీ కమిషన్ ఆదేశాలు పాటించాలి

సారవకోట: ఆదివాసీల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గురుకుల బైలాస్ ప్రకారం జనరల్ డీఎస్సీలో గిరిజనులు పోస్టులు కలపరాదని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం 1143 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీలో చేర్చిందన్నారు. దీనిపై జాతీయ ఎస్టీ కమిషన్‌కి ఫిర్యాదు చేయగా.. గిరిజన గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీ గిరిజన గురుకుల కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. వీటిని ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వ పాలకులకు ఉందన్నారు.

సిట్ అధికారుల తీరు సరికాదు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ పాలనకు సిట్ అధికారులు రెడ్ కార్పెట్ వేస్తూ తప్పుడు వాంగ్మూలం కోసం చేసిన తప్పుడు ప్రయత్నాలు బయటపడ్డాయని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లిక్కర్ స్కాం జరిగిందంటూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేయాలని కుట్రలు పన్నడం తగదన్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డిని జైలుకు పంపించాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు సిట్ అధికారులను పావులుగా వాడుకుని గన్‌మెన్‌లను సైతం చిత్రహింసలకు గురి చేయడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. తప్పుడు కేసులకు అధికారులు వత్తాసు పలికితే భవిష్యత్‌లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

మడ్డువలస కాలువలో పూడిక తొలగింపు

జి.సిగడాం: మడ్డువలస ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న జి.సిగడాం మండలం పెంట గ్రామంలో ప్రధాన కుడి కాలువలో పేరుకుపోయిన పూడికలను ఎట్టకేలకు తొలగిస్తున్నారు. ఏటా ఖరీఫ్‌లో సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా యంత్రాల ద్వారా మడ్డుకాలువలో పూడికలు తొలగిస్తున్నారు. ఈ పనులను మంగళవారం నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయలక్ష్మి పర్యవేక్షించారు.

ఈదుపురంలో ఇరువర్గాల కొట్లాట



ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రిలో క్షతగాత్రులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామంలో మంగళవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ కొట్లాటకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిలి జగన్నాథం, అంబటి శంకర్‌కు చెందిన అనుచరుల మధ్య మూడు రోజుల క్రితం పిక్కాట వద్ద ఘర్షణ చెలరేగింది. గ్రామపెద్దలు కలగజేసుకొని సోమవారం గ్రామంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. మంగళవారం వేణుగోపాల కాలనీ వద్ద మరోసారి ఇరువర్గాలు ఘర్షణ ఏర్పడటంతో కొట్లాటకు దారితీసింది. కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో దాసరి పుణ్యావతి, మద్దిలి జగన్నాథం, అంబటి శంకర్, అంబటి కుమార్, మురళీ, దువ్వ ఎల్లయ్య, దువ్వ ప్రశాంత్, బోర యువరాజులు తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన వారిని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి పది మంది బాడీబిల్డర్లను ఎంపికచేశారు. స్థానికంగా జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో రాణించిన బాడీబిల్డర్లు ఈ నెల 22న నెల్లూరులో జరిగే రాష్ట్రపోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు మంగళవారం పేర్కొన్నారు. కార్యక్రమంలోస్టార్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.విజయ్‌కుమార్, ది ఆంధ్రా బాడీబిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.గౌరీశంకర్, వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు పథకాలు వర్తింపజేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ కార్మికులందరికి (ఇంజనీరింగ్, పారిశుధ్య) తల్లికి వందనంతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం నగర కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగి అనే పదాన్ని తొలగించి మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. అప్పట్లో 17 రోజుల సమ్మె సందర్భంగా ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు స్పందిస్తూ అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలన్నీ ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మంచి జరుగుతుందని కార్మికులు, ప్రజలు ఆశించారని, అందుకు భిన్నంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సూరయ్య, టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం, నగర అధ్యక్షులు ఎ.గణేష్, కమిటీ సభ్యులు ఎ.గురుస్వామి, ఆర్జి.శేఖర్, ఎ.జనా తదితరులు పాల్గొన్నారు.

స్థలం కబ్జాకు యత్నం

- టీడీపీ కార్యకర్తపై బాధితుడి ఫిర్యాదు



స్థలం డాక్యుమెంట్ చూపిస్తున్న బాధితుడు వెంకటరమణ

ఆమదాలవలస: పట్టణ నడిబొడ్డున ప్రధార రహదారి పక్కనే ఉన్న శివాలయం ఎదురుగా తన స్థలాన్ని కబ్జా చేసేందుకు టీడీపీ కార్యకర్త బొడ్డేపల్లి విజయ్‌కుమార్ ప్రయత్నిస్తున్నాడని స్థల యజమాని పుల్లేటికుర్తి వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వేకువజామున విజయ్ తన అనుచరులతో కలిసి జేసీబీ సాయంతో స్థలాన్ని చదును చేసేందుకు యత్నించగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తమ్మినేని ప్రసాద్ అనే వ్యక్తి పేరుతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి స్థలాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నాడని, ఈ విషయమై ప్రసాద్‌ను ప్రశ్నించగా తనకేమీ సంబంధం లేదని తెలిపాడని పేర్కొన్నారు. ఈసీ, లింక్ డాక్యుమెంట్లు అన్నీ తన పేరుపై (వెంకటరమణ) ఉన్నప్పటికీ కబ్జాదారుడిపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. విజయ్‌పై ఇప్పటికి మూడు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఆయన వల్ల ప్రాణహాని ఉందని వాపోయారు. ఎస్పీ, కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌లో సైతం ఫిర్యాదు చేశానని, సమస్య పరిష్కారం కాకుంటే చావే శరణ్యమన్నారు.

ఘనంగా పుష్పయాగ మహోత్సవం



పుష్పయాగ మహోత్సవం



సుగంధ ద్రవ్యాలను దంచుతున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని డీసీసీబీ కాలనీలో భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం 4వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం స్వామి వారికి పుష్పయాగ మహోత్సవం జరిగింది. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, చామర్తి జగన్నాథాచార్యులు నేతృత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఉదయం చూర్ణోత్సవంలో భాగంగా మహిళలు రోకలితో సుగంధ ద్రవ్యాలను దంచారు. పూర్ణాహుతి, వసంత మండపారాధన, చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిపించారు.